నిరుపయోగంగా బస్టాండ్

- ప్రయాణికులకు తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు


బస్టాండ్ పక్కనే పేరుకున్న మురుగు


నిరుపయోగంగా పెంట్లవెల్లి బస్టాండ్

పెంట్లవెల్లి: ప్రయాణికుల సౌకర్యార్థం 1997వ సంవత్సరంలో మండల కేంద్రంలో బస్టాండ్ ఏర్పాటు చేశారు. మొత్తం రెండు ఎకరాల విస్తీర్ణంలో బస్టాండ్‌ను నిర్మించి అందుబాటులోకి తీసుకొచ్చారు. మొత్తం రూ.12 లక్షల నిధులతో బస్టాండ్‌ను నిర్మించి ప్రారంభించారు. పలు గ్రామాల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నా ఆర్టీసీ అధికారులు నిర్లక్ష్యం కారణంగా నిరుపయోగంగా మారింది. బస్టాండ్ ప్రారంభించిన ఒక సంవత్సరం పాటు బస్సులు బస్టాండ్ ప్రాంగణంలో నిలిపి ప్రయాణికులు ఎక్కించుకొని గమ్యస్థానాలకు చేర్చారు. కాని ఆర్టీసీ అధికారులు పట్టించుకోకపోవడంతో బస్సులను డ్రైవర్లు రోడ్లపైనే నిలుపుతున్నారు. ప్రస్తుతం ఏ ఒక్క బస్సు కూడా బస్టాండ్‌లోకి వెళ్లడం లేదు. దీంతో నానా అవస్థల పడుతున్నారు. సమీపంలో చెట్లకింద బస్సులను నిలపడంతో పలు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణికులు చలికి, వానకు, ఎండకు చెట్ల కిందట బస్సుల కోసం పడిగాపులు కాస్తు ప్రయాణాలు కొనసాగించాల్సిన దుస్థితి నెలకొంది.

రోడ్లపైనే ఆపడంతో..

రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన ఆర్టీసీ బస్టాండ్ ప్రజలకు మున్నాళ్ల ముచ్చటగానే మిగిలింది. ఒక సంవత్సరం మాత్రమే బస్టాండ్ లోపలికి బస్సులు రాకపోకలు కొనసాగాయి. ఆ తర్వాత బస్సులు రోడ్లపైనే ఆపడంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. ప్రభుత్వ నిధులు వృథా అవుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకొని బస్టాండ్ వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

దుర్వాసన

బస్టాండ్ నిరుపయోగంగా మారడంతో చుట్టు పక్కల ఉన్న చికెన్, మటన్, మద్యం దుకాణాదారులు వ్యర్థాలను బస్టాండ్ ప్రాంగణంలో పడేస్తున్నారు. దీంతో నిత్యం దుర్వాసన రావడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. దీనికి తోడు మురుగు పారడంతో దోమలకు ఆవాసాలుగా మారాయి.

పట్టించుకోని అధికారులు

బస్టాండ్‌లోకి బస్సులు రావడం లేదని పలు గ్రామాల ప్రజలు ఆర్టీసీ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ప్రయాణికులు విమర్శిస్తున్నారు. రాత్రివేళ చెట్ల కింద ఉండేందుకు మహిళలు, చిన్నారులు భయపడుతున్నారు. ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదని ప్రయాణికులు ఆరోపించారు.

అందుబాటులోకి తీసుకురావాలి



బస్సులు రోడ్లపైనే నిలపడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. బస్సు డ్రైవర్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. కొన్నేళ్ల నుంచి బస్సులు బస్టాండ్‌లోకి వెళ్లకపోవడంతో సమీప వ్యాపారస్తులు చెత్తను, వ్యర్థాలను పడేస్తున్నారు. ఆర్టీసీ అధికారులు చొరవ తీసుకొని బస్టాండ్‌ను అందుబాటులోకి తీసుకురావాలి. బస్సులు రోడ్లపైన నిలపకుండా చర్యలు చేపట్టాలి.

– శేఖర్, ప్రయాణికుడు

వినియోగంలోకి తీసుకొస్తాం

బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకున్నాం. కొన్ని రోజుల కిందట పనులను కాంట్రాక్టర్‌కు అప్పగించాం. సకాలంలో పనులు చేయకపోవడం కొత్త కాంట్రాక్టర్‌కు అప్పగించేందుకు నిర్ణయించాం. త్వరలో బస్టాండ్ చుట్టూ మురుగు, కంపచెట్లు తొలగిస్తాం. త్వరలోనే బస్టాండ్‌లోకి బస్సులు వచ్చేలా చర్యలు చేపట్టాం.

– ఉమాశంకర్, డీఎం, కొల్లాపూర్

మహాత్ముడికి ఘన నివాళి


నాగర్‌కర్నూల్‌లో నివాళులర్పిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు


పెద్దకొత్తపల్లిలో గాంధీజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న తహసీల్దార్ జేకే మోహన్

సాక్షి, నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా గురువారం జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలతో పాటు రాజకీయ పార్టీ, ప్రజాసంఘాల, ప్రభుత్వ కార్యాలయాల్లో ఆయా శాఖల అధికారులు, నాయకులు నివాళులర్పించారు. గాంధీజీ, విగ్రహాలకు, చిత్రపటానికి పూలమాల వేసి దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కొల్లాపూర్‌లో పేదలకు పండ్లు, బ్రెడ్, దుస్తులు పంపిణీ చేశారు. కల్వకుర్తిలో స్వచ్ఛభారత్ నిర్వహించారు.


కల్వకుర్తిలో ..


అచ్చంపేటలో..

క్లుప్తంగా

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



ఊర్కొండ: రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని తిమ్మన్నపల్లిలో 20 మంది రైతులకు మంజూరైన స్ప్రింక్లర్ పైపులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి సీఎం రేవంత్‌రెడ్డి నిరంతరం పాటుపడుతున్నారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు భాష మోని రామాంజనేయులు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ద్యాప నిఖిల్ రెడ్డి, నాయకులు పాతర్ల తిరుపయ్య, సల్వాది శేఖర్, ఆదినారాయణ, హర్టికల్చర్ అధికారి మహేశ్వరి, జైన్ కంపెనీ డీలర్ అబ్దుల్ రెహమాన్, నాయకులు ,శ్యామ్, గోరింక నర్సింహ్మ, గంజి యాదయ్య, పాతర్ల చంద్రశేఖర్, బండార్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

చారకొండ: మండల కేంద్రం సమీపంలో ప్రధాన రహదారిపై ఎస్ఐ శంషుద్దీన్ గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఎవరైన నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనదారులు రోడ్డు నియమ నిబంధనలపై అవగాహన కల్పించారు. పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

సీసీఎల్ మంజూరు చేయండి

అచ్చంపేట: జిల్లాలో సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొన్న ఉపాధ్యాయులకు సీసీఎల్ మంజూరు చేయాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌రావు డిమాండ్ చేశారు. సర్వేలో పాల్గొన్న ఉపాధ్యాయులకు గత నవంబరు నెలలో రెండో శనివారం, గురునానక్ జయంతి, మూడు ఆదివారాలు మొత్తం ఐదు సెలవు దినాల్లో పనిచేసినందుకు ఐదు సీసీఎల్ మంజూరు చేయాలని కోరారు. అదేవిధంగా వెంటనే రెమ్యూనరేషన్ మంజూరు చేయాలన్నారు.

వృద్ధాశ్రమంలో సౌకర్యాలపై ఆరా

బిజినేపల్లి: మండల కేంద్రానికి సమీపంలో ఉన్న ప్రశాంతి నిలయం వృద్ధాశ్రమంలో వృద్ధుల ఆరోగ్యం, అందులోని సౌకర్యాలు, వంట గది, సామాగ్రి గది, భోజనశాల వంటి వాటిని డీఈవో రమేష్‌కుమార్, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శ్రవణ్‌కుమార్‌లు గురువారం కలిసి సందర్శించారు. వృద్ధులతో ఆప్యాయంగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలు రికార్డులను పరిశీలించి తనిఖీ చేశారు. అనంతరం డీఈఓ పాలెం జెడ్పీహెచ్ఎస్ పాఠశాలను సందర్శించి పది విద్యార్థుల విద్యా ప్రమాణాలు పరిశీలించారు.


ఎంఈఓ తనిఖీ

లింగాల: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని గురువారం మండల విద్యాధికారి బషీర్ అహ్మద్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంట గదిని, పాఠశాల పరిసరాలను నిత్యావసర సరకులు, బియ్యం నిల్వ ఉంచే గదిని పరిశీలించారు. ఆయన వెంట ఎస్ఓ శారద, ఉపాధ్యాయులు, సీఆర్పీ పాల్గొన్నారు.

టెంకాయల అమ్మకానికి వేలం

వెల్దండ: మండలంలోని గుండాల అంబారామలింగేశ్వరస్వామి దేవాలయంలో ఉత్సవాల సందర్భంగా గురువారం టెంకాయల వేలం పాట వేశారు. గుండాలకు చెందిన కె. అంజయ్య రూ.3.30లక్షలకు వేలంలో దక్కించుకున్నారు. అదే విధంగా లడ్డు, పులిహోర, ప్రసాదాల విక్రయించడానికి బొమ్మరాశిపల్లి గ్రామానికి చెందిన ఆర్. కృష్ణయ్య రూ.3,07,600 లకు దక్కించుకున్నారు. సంవత్సరానికి టెంకాయలు రూ.1.33లక్షలు, లడ్డు, పులిహోర రూ.72వేలకు ఆర్. కృష్ణయ్యకు దక్కించుకున్నారు. కొబ్బరి చిప్పల పోగు చేయుటకు గుండాలకు చెందిన కె. రామకృష్ణ రూ.10వేలకు పాట పాడారు. వేలం పాటలో మొత్తం రూ.8,52,600 ఆదాయం వచ్చిందని ఈఓ ప్రసాద్ వివరించారు.

చెంచులకు ఉపాధి కల్పనే ధ్యేయం



మన్ననూర్: చెంచులకు ఉపాధి కల్పనే ధ్యేయంగా పనిచేస్తున్నామని కోనేరు స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ సలీమ్ అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో డ్రైవింగ్‌లో శిక్షణ పొందిన చెంచు యువకులకు గురువారం మన్ననూర్‌లోని రైతువేదిక ఆవరణలో లైసెన్స్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఐటీడీఏ ఇన్‌చార్జ్ పీఓ, డీఎఫ్ఓ రోహిత్‌రెడ్డి హాజరై మాట్లాడారు. కొంతకాలంగా కోనేరు సంస్థ చెంచుల అభివృద్ధి, సంక్షేమం కోసం ఎంతగానో కృషి చేస్తుందని కొనియాడారు. 20 మంది చెంచు యువకులకు ఆయన డ్రైవింగ్ లైసెన్స్‌లను అందజేశారు. ఎఫ్ఆర్ఓ దేవజ, ఎఫ్ఎస్ఓ శ్రీకాంత్, కోనేరు సంస్థ ప్రతినిధులు తిరుపతయ్య, బాలకృష్ణ, ఇస్మాయిల్, నందిని, యువకులు పాల్గొన్నారు.

మడేలయ్య దేవాలయ నిర్మాణానికి భూమిపూజ

వెల్దండ: మండల కేంద్రంలోని రజకుల ఆరాధ్య దైవమైన మడేలయ్య దేవాలయ నిర్మాణానికి గురువారం మాజీ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్యగౌడు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భక్తిభావంతో ప్రశాంతత కలుగుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు యాదగిరి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఎర్రశ్రీనుముదిరాజ్, శ్రీశైలం ముదిరాజ్, కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు భరత్‌గౌడు, కిష్టాల్, రామకృష్ణ, మల్లేష్, రాజేష్, రాకేష్, శ్రీను, వెంకటయ్య, రజక సంఘం నాయకులు, తదితరులు ఉన్నారు.

దేవాలయానికి మైక్‌సెట్ వితరణ

కల్వకుర్తి రూరల్: మండలంలోని మార్చాలలో లక్ష్మీచెన్నకేశవ స్వామి దేవస్థానానికి రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు తలసాని కృష్ణారెడ్డి రూ.20వేలు విలువగల మైక్‌సెట్‌ను గురువారం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ మదన్మోహన్ రావు, ఆలయ కమిటీ సభ్యులు సత్యపాల్, చెన్నయ్య, మల్లేష్, కిరణ్, రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రానికి తరలిన ఎమ్మార్పీఎస్ నాయకులు

తాడూరు: జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించిన లక్ష డప్పులు –వేయి గొంతుకల కార్యక్రమానికి మండల కేంద్రం నుంచి ఎమ్మార్పీఎస్ నాయకులు అధికసంఖ్యలో తరలివెళ్లారు. తరలిన వారిలో బాలెంకటయ్య, ఐతోలు లక్ష్మయ్య, నిరంజన్, వీరయ్య, తదితరులు ఉన్నారు.

చోరీ కేసులో జైలుశిక్ష

బిజినేపల్లి: మండలంలోని వెల్గొండ గ్రామానికి చెందిన ఈర్ల సంజీవయ్య నివాసంలో 2017వ సంవత్సరంలో బుద్దారం మల్లేష్ దొంగతనానికి పాల్పడ్డాడు. గురువారం నాగర్‌కర్నూల్ సెకండ్ అడిషనల్ జూనియర్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ శ్రీనిధి నిందితుడికి మూడు నెలల జైలుశిక్ష, రూ.2వేల జరిమానా విధించినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు



కందనూలు: జిల్లా కేంద్రంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో మూడోరోజు క్రికెట్, కబడ్డీ పోటీలు కొనసాగాయి. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ రమేష్ మాట్లాడుతూ చోడో మొబైల్.. చలో మైదాన్ అనే నినాదంతో క్రీడోత్సవాలు నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. యువకులు మద్యానికి దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ శివశంకర్, బంగారుబాబు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న డప్ప కళాకారుల ప్రదర్శన



తిమ్మాజీపేట: మండల కేంద్రంలో గురువారం డప్పు కళాకారుల నిర్వహించిన ప్రదర్శన ఆకట్టుకుంది.ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక ,అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ నాగర్‌కర్నూల్ పట్టణానికి వస్తున్న సందర్భంగా మండలం కేంద్రంలో దళిత సంఘాల ఆధ్వర్యంలో డప్పు కళాకారులు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నిరంతరంగా డప్పుల ప్రదర్శన నిర్వహించారు. టపాకాయలు, బాణసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి గజమాల వేశారు. డప్పు కళాకారులు, వందలాది ద్విచక్ర వాహనాలతో తిమ్మాజీపేట నుంచి నాగర్‌కర్నూల్ వరకు ర్యాలీగా వెళ్లారు. కార్యక్రమంలో ఎమ్మార్పీస్, దళిత సంఘాల నాయకులు, డప్పుకళాకారులు పాల్గొన్నారు.

విద్యార్థినికి బహుమతి



అచ్చంపేట రూరల్: పట్టణంలోని ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన వ్యాస రచన పోటీలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు గురువారం డిపో మేనేజర్ మురళీదుర్గాప్రసాద్ బహుమతులు అందజేశారు. పట్టణంలోని కాకతీయ హైస్కూల్‌కు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థిని దీక్షిత ప్రథమ బహుమతి అందుకుంది. స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయబృందం విద్యార్థినిని అభినందించారు.

యువతి అదృశ్యం: కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం: యువతి అదృశ్యమైన ఘటనలో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గోవర్ధన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం జిల్లా కేంద్రానికి చెందిన స్వాతి ఈనెల 27న కళాశాలకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లింది. ఎంతకీ తిరిగిరాకపోవడంతో కుటుంబసభ్యులు ఎంత వెతికినా యువతి ఆచూకి లభ్యం కాలేదు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్ తల్లి జ్యోతి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎంపీటీసీల స్థానాల ముసాయిదా విడుదల

తాడూరు: మండలంలోని 10 ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి డ్రాఫ్ట్ పబ్లికేషన్ గురువారం వేశామని ఎంపీడీఓ ఆంజనేయులు తెలిపారు. మండలంలో శిర్సవాడ, బలాన్‌పల్లి, అంతారం, తుమ్మలసుగురు, చెర్లతిర్మలాపూర్, ఇంద్రకల్, మేడిపూర్, యాదిరెడ్డి పల్లి, తాడూరు, అల్లాపూర్‌లను గుర్తించినట్లు పేర్కొన్నారు. అభ్యంతరాలను శుక్రవారం సాయంత్రం 5 గంటలలోపు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో రాత పూర్వకంగా దరఖాస్తు ఇవ్వాలని ఆయన తెలిపారు.

చారకొండలో..

చారకొండ: మండలంలోని ఎంపీటీసీ స్థానాలకు ముసాయిదా ప్రకటనను గురువారం ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్ విడుదల చేశారు. మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని ఆరు ఎంపీటీసీ స్థానాలు చారకొండ–1, చారకొండ–2, సిర్సనగండ్ల, తుర్కలపల్లి, చంద్రాయన్‌పల్లి, జూపల్లి ముసాయిదా ప్రకటన విడుదల చేశారు. ముసాయిదాను ఆయా స్థానాలకు సంబంధిత వివరాలతో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. వారి వెంట ఎంపీఓ వెంకటేష్ తదితరులు ఉన్నారు.

వెల్దండలో..

వెల్దండ: మండల పరిషత్ కార్యాలయ అవరణంలో ఎంపీఓ లక్ష్మణ్ గురువారం మండలంలోని ఎంపీటీసీల వారిగా జనాభా వివరాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మండలంలోని మొత్తం 32 గ్రామ పంచాయతీలు ఉండగా 11 ఎంపీటీసీల వారిగా జనాభా, గ్రామ పంచాయతీలను విడుదల చేసినట్లు తెలిపారు. మొత్తం 36500 జనాభా ఉన్నట్లు అధికారులు వివరించారు.

కల్వకుర్తి రూరల్: మండలంలోని 11 ఎంపీటీసీ స్థానాల జాబితాను గురువారం ఎంపీడీఓ వెంకటరాములు కార్యాలయంలో విడుదల చేశారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

తెలకపల్లి: రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని ఎస్ఐ నరేష్ అన్నారు. గురువారం జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలలో భాగంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి పోలీసులు మండల పురవీధులగుండా గాంధీ, అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రాం, నెహ్రూ చౌరస్తాల మీదుగా బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బస్టాండ్‌లో ఎస్ఐ మాట్లాడుతూ రోడ్డు భద్రత నియమాలపై ప్రజలకు, విద్యార్థులకు, ప్రయాణికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ సుధీర్, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాస్మా ఆధ్వర్యంలో..

పెంట్లవెల్లి: మండల కేంద్రంలోని ప్రైవేట్ స్కూల్స్ మేరిమాత, వశిష్ట స్కూల్స్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు విద్యార్థులతో కలిసి ప్లకార్డులు ప్రదర్శించారు. అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీగా వెళ్లారు. ఎస్ఐ రామన్‌గౌడ్ మాట్లాడుతూ వాహనదారులు హెల్మెట్, సీటబెల్ట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో ట్రాస్మా గౌరవ అధ్యక్షుడు రామానుజం, రఘుపతిరెడ్డి, శివకుమార్, వెంకటేష్, భగవాన్‌గౌడ్, జోబిజోసఫ్, ప్రహ్లద్, శ్రీధర్‌గౌడ్‌లు పాల్గొన్నారు.

ఫైనల్‌కు చేరిన బళ్లారి, మన్నెవారిపల్లి సీసీ జట్లు

అచ్చంపేట రూరల్: పట్టణంలోని రాజీవ్– ఎన్టీఆర్ మినీ స్టేడియంలో జరుగుతున్న సీవీకే ఆల్ ఇండియా లెవల్ టీ–20 క్రికెట్ టోర్నీలో గురువారం సెషన్‌లో గ్రూప్ ఏ నుంచి మొదటి సెమీఫైనల్‌లో మస్కటి హైదరాబాద్ జట్టుపై బళ్లారి జట్టు రెండో సూపర్ ఓవర్‌లో నెగ్గింది. సెషన్ గ్రూప్ బీ నుంచి ఖలీం–11 జైనూర్ వర్సెస్ మన్నెవారిపల్లి సీసీ జట్లు తలపడ్డాయి. మన్నెవారిపల్లి జట్టు గెలపొందింది. ఫిబ్రవరి 1న ఉదయం 11 గంటలకు ఫైనల్ మ్యాచ్‌ను ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు కపిలవాయి చంద్రమోహన్, కటకం రఘురాం తెలిపారు.

కుష్టువ్యాధిపై అవగాహన ర్యాలీ



బిజినేపల్లి: మండలంలోని పాలెం పీహెచ్‌సీ వైద్య బృందం ఆధ్వర్యంలో పాలెం జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రియాంక పాలెం వీధుల్లో తిరుగుతూ ప్రజలకు కుష్టువ్యాధి లక్షణాలను తెలిపారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాడూరు: మండల కేంద్రంలో జిల్లా వైద్య శాఖ ఆధ్వర్యంలో కుష్టు వ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ సంతోష్, అభిరామ్ పాల్గొని సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్ర

మన్ననూర్: భారత రాజ్యాంగాన్ని కేంద్ర ప్రభుత్వం మార్చేందుకు కుట్ర పన్నుతోందని ప్రజా సంఘాల నాయకులు సెవ్వ పాండు, మద్దెల దివాకర్, దూమర్ల ఎల్లస్వామి ఆరోపించారు. గురువారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడారు. కోట్లాది మంది ప్రజల అభిమానం కంటే పద్మశ్రీ అవార్డు గొప్పది కాదని దీనిని కేంద్ర మంత్రి బండి సంజయ్ గుర్తించుకోవాలని కోరారు. భారత రత్న, పద్మ విభూషన్, పద్మశ్రీ అవార్డులలో రాజకీయ నాయకుల జోక్యం అధికం అయ్యిందని విమర్శించారు. రాజకీయ నాయకులకు వత్తాసు పలికే వారికి కొందరికి అవార్డులు ఇవ్వడం సిగ్గుచేటన్నారు. గద్దర్‌పై బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని కోరారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో జైలుశిక్ష

నాగర్‌కర్నూల్ క్రైం: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తికి జైలుశిక్షతో పాటు జరిమానాను విధిస్తు గురువారం జూనియర్ సివిల్ జడ్జి మౌనిక తీర్పు వెలువరించారు. వివరాలిలా బొందలపల్లి గ్రామానికి చెందిన గుంటి కార్తీక్ ఈ నెల24 మద్యం తాగి వాహనం నడుపుతుండగా పోలీసులకు పట్టుబడ్డాడు. స్థానిక కోర్టులో హాజరుపర్చగా జడ్జి నిందితుడికి రూ. 2 వేలు జరిమానా, మూడురోజుల జైలు శిక్ష విధించారు.

బైక్ ఢీ : వ్యక్తికి తీవ్రగాయాలు

ఊర్కొండ: బైక్ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ భూపతిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం చింతల శంకర్ రెడ్డి వ్యవసాయ పనులు ముగించుకొని నడుచుకుంటు ఇంటికి వెళ్తుండగా అమీనుద్దీన్ దర్గా వద్ద వెనకనుంచి గుర్తుతెలియని బైక్ ఢీకొన్నది. క్షతగాత్రుడిని కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం మహబూబ్‌గర్ ఎస్వీఎస్ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి కుమారుడు మధుసూదన్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని హెడ్ కానిస్టేబుల్ భూపతిరెడ్డి తెలిపారు.

సైబర్‌నేరంపై కేసు నమోదు

కల్వకుర్తి టౌన్: ఓ ప్రైవేట్ యాప్‌లో పెట్టుబడి పెట్టాలంటూ చెప్పే వారిని నమ్మి మోసపోవద్దని కల్వకుర్తి ఎస్ఐ మాధవరెడ్డి అన్నారు. కల్వకుర్తికి చెందిన సూర్యకుమార్ తన మిత్రుడు అమీర్ చెప్పటంతో నమ్మకంగా డెక్లతాన్ యాప్‌లో పెట్టుబడి పెట్టాడు. గత నెల డిసెంబర్ 25వ తేదీన యాప్‌లో రూ.1,48,940లు పెట్టుబడి పెట్టగా, ఇప్పటివరకు ఎలాంటి రిటర్నులు రాలేదు. మోసపోయానని భావించి సైబర్‌క్రైంతో పాటు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

‘బాలుడిని ఆదుకోవాలి’

మన్ననూర్: ప్రమాదవశాత్తు మంటల్లో పడి గాయపడిన నాలుగేళ్ల చిన్నారి బాలుడు రాఘవేందర్‌ను ఐటీడీఏ అధికారులు అన్ని విధాలుగా ఆదుకోవాలని పౌరహక్కుల సంఘం నాయకులు జక్కబాలయ్య, బియ్యని వెంకటేష్, కుల నిర్మూలన పోరాట సమితి నాయకుడు ముద్దునూరి లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. నల్లమల అటవీ లోతట్టు ప్రాంతం పుల్లాయిపల్లి చెంచు పెంటకు చెందిన తోకల బాలమ్మ, రవి కుమారుడు తోకల రాఘవేందర్ ప్రమాదవశాత్తు గుడిసెలో వేసుకున్న చలి మంటలో పడి తీవ్రంగా గాయపడ్డాడు. అచ్చంపేట వైద్య విధాన పరిషత్ ఆస్పత్రికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. బాధితుడిని హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించి నాణ్యమైన చికిత్స అందించి ప్రాణాలు కాపాడాలని అధికారులను కోరారు.

బండి సంజయ్ క్షమాపణ చెప్పాలి



తాడూరు: కేంద్ర హోం సహాయక శాఖ మంత్రి బండి సంజయ్ ప్రజా యుద్ధనౌక గద్దర్‌పై చేసిన వ్యాఖ్యలపై క్షమాపణ చెప్పాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు మద్దెల చంటి డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతినిత్యం సమాజంలోని బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అడుగడున జరుగుతున్న అవమానాలపై గద్దర్ తన ఆట, పాటలతో గుర్తుచేస్తూ చైతన్యం చేశారని గుర్తు చేశారు. సమాజంలోని అసమానతలను తొలగించేందుకు ఎంతో కృషి చేశారన్నారు. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా రాజ్యాంగాన్ని అవమానించడం తగదన్నారు. కేంద్ర మంత్రి హోదాలో వారు చౌకబారు విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. సమావేశంలో మాలమహానాడు నాయకుడు చంద్రయ్య, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం


పెంట్లవెల్లిలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న బీఆర్ఎస్ నాయకులు


తిమ్మాజిపేటలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న బీఆర్ఎస్ నాయకులు

తెలకపల్లి: హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయ్యిందని బీఆర్ఎస్ మండల నాయకులు పేర్కొన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు గురువారం మండల కేంద్రంలోని మహాత్మా గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. నాయకులు హనుమంతు రావ్, రెడ్డపాకుల రమేష్, మాధవరెడ్డి, రాములు, సుందర్ రెడ్డి, లక్ష్మారెడ్డి, విష్ణు, జమ్ములు, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం గద్దె దిగాలి

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోతుల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కొత్త బస్టాండ్‌లో గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం గద్దె దిగాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోతుల వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ రాజేష్, సురేందర్‌గౌడ్, నర్సింహ, రఫియోద్దీన్, అబ్దుల్‌రఫి, రవి పాల్గొన్నారు.

ప్రభుత్వానికి కనువిప్పు కలిగించు మహాత్మా..

తిమ్మాజీపేట: మోసపూరిత హామీలు ఇచ్చి అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వానికి కనువిప్పు కలిగించాలని కోరుతూ గురువారం తిమ్మాజిపేటలోని గాంధీ విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ప్రదీప్, మాజీ ఎంపీపీ రవీంద్రనాథ్‌రెడ్డి, గోపిగౌడ్ స్వామి, వెంకటేష్, శ్యామ్, సలావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీ విగ్రహానికి వినతిపత్రం

బిజినేపల్లి: ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ రైతు సమన్వయ సమితి మాజీ మండల అధ్యక్షుడు నెల్లికంటి మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడు గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. మండలంలోని పాలెం గ్రామంలోని గాంధీ విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, ఫించన్ల పెంపు వంటి హామీలు అమలు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. గంగనమోని కిరణ్ తిరుపతిరెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖలో అక్రమ బదిలీలు?

అచ్చంపేట: విద్యుత్‌శాఖలో సాధారణ బదిలీలు జరిగినా రిలీవ్‌కాకుండా అక్రమంగా స్టేటస్కో తెచ్చుకుని కుర్చీ వదలడం లేదని విద్యుత్ ఐఎన్‌టీయూసీ 327యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలయ్య ఆరోపించారు. సాధారణ బదిలీలలో ఎన్నిసార్లు ట్రాన్స్‌ఫర్ చేసిన పైరవీలతో ఇక్కడే ఉద్యోగం చేయడమే కాని, ఇదేంటని ప్రశ్నించిన అధికారులపై దాడులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అచ్చంపేట, కల్వకుర్తి ఈఆర్ఓ కార్యాలయంలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్లు బదిలీ జరిగితే రిలీవ్ అయి విధులకు హాజరు కాకుండా కోర్టుల చుట్టు తిరిగిన అచ్చంపేట సీనియర్ అసిస్టెంట్‌కు జీతం ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. అదే విధంగా బదిలీ అయిన తర్వాత రిలీవ్ చేసిన ఉద్యోగితో ఇక్కడ పనిచేయించుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. గత పదేళ్లుగా ఒకే దగ్గర పనిచేస్తున్న వారికి వెసులుబాటు కల్పించినప్పుడు మాకు ఎందుకు వెసలుబాటు కల్పించరని ప్రశ్నించారు. నలుగురు ఫోర్‌మేన్ స్థాయి ఉద్యోగులు స్టేటస్కో తెచ్చుకొని పాత స్థానాల్లో పనిచేస్తున్న కారణంగా, గత నెలలో ఫోర్‌మేన్ క్యాడర్ వాళ్లను రిలీవ్ చేయకుండా వారికి కోర్టుకు వెళ్లే వెసలుబాటు కల్పించిన అమ్రాబాద్, నాగర్‌కర్నూలు, పెద్దకొత్తపల్లి ఏఈల ఆంతర్యం ఏమిటన్ని ప్రశ్నించారు.